# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-01-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏడు విమానాశ్రయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2.** **తెలంగాణలో ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లో ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**

**4.** **తెలంగాణను గ్రీన్ హైడ్రోజన్‌కేంద్రంగా మారుస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**

**5.** **రాష్ట్రంలో ఆహార శుద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ భరత్ తెలిపారు.**

=============================

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏడు విమానాశ్రయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల నిర్మాణం, అభివృద్ధిపై ఉండవల్లిలో పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, సంబంధిత అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, తుని-అన్నవరం, ఒంగోలులో కొత్త విమానాశ్రయాలను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు. కూచిపూడి నృత్యం, అమరావతి స్తూపం ఇతివృత్తంతో రూపొందించిన ఆకృతులతో గన్నవరం విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనాన్ని నిర్మించనున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తెలుగువారు అన్ని రంగాల్లో రాణించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు.. శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకు ఎక్కడ ఉన్నా, తెలుగువారంతా ఒక్కటేనని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ

వాయిస్ ...37 సెకన్లు

---------------------------

తెలంగాణలో 2050 నాటికి నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. బోర్డు ఛైర్మన్ హోదాలో తొలిసారి జలమండలి అధికారులతో ముఖ్యమంత్రి నిన్న హైదరాబాద్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోదావరి ఫేజ్–2 ప్రాజెక్టుపై అధికారులతో చర్చించారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి నీటి సేకరణపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా 20 టీఎంసీలు తెచ్చుకునేలా ప్రతిపాదించిన మార్పులకు ఆమోదం తెలిపారు. మంజీరా పైపులైన్‌కు అదనంగా ప్రత్యామ్నాయ పైపులైన్ నిర్మించాలని అధికారులకు ముఖ్యమంత్రి  సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు పథకంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా ఉపసంఘం సభ్యులు ఎం రాంప్రసాద్‌రెడ్డి, వి అనిత, జి సంధ్యారాణి కర్ణాటకలో పర్యటించి, ఆ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం చేశారు. కర్ణాటక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ, వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యతో  మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమై పలు అంశాలపై చర్చించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంగ్లం, తెలుగు.. రెండు భాషల్లోనూ ఉత్తర్వులు ఇవ్వాలని అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. మొత్తం మూడు పద్ధతుల్లో ఉత్తర్వులు జారీ చేయవచ్చని పేర్కొంది. మొదట ఆంగ్లంలో ఉత్తర్వులు వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే.. రెండు రోజుల్లోగా తెలుగులోనూ వాటిని జారీ చేయాలని సూచించింది. రెండవ పద్ధతిలో మొదట తెలుగులో జీవోను ఇస్తే ఒకటి, రెండు రోజుల్లో ఆంగ్లంలో అప్‌లోడ్ చేయాలని, మూడవ పద్ధతిలో రెండు భాషల్లోనూ ఒకేసారి ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో పెట్టవచ్చని సూచిస్తూ సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

తెలంగాణను గ్రీన్ హైడ్రోజన్ కేంద్రంగా మారుస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ ఐఐటీలో ఆస్ట్రేలియా–ఇండియా ఖనిజ పరిశోధనా కేంద్రం నిర్వహించిన కర్యశాలను  ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా  ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో  ఐఐటీలది కీలకపాత్ర అని అన్నారు. 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్‌లో 2 వేల మెగావాట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆయన పేర్కొంటూ,

వాయిస్ ... 37 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఆహార శుద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్  పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ భరత్ తెలిపారు. గుంటూరు జిల్లా  మంగళగిరిలో ఆహార పరిశ్రమల ప్రోత్సాహక  హెల్ప్‌లైన్ ను మంత్రి  నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా  టీజీ భరత్ మాట్లాడుతూ,  ప్రభుత్వ విధానాలలో పారదర్శకత,

ఆహార శుద్ధి రంగంలోని పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారి సమస్యలకు పరిష్కార మార్గాలను చూపడం దీని ప్రధాన లక్ష్యం అన్నారు. చిన్న వ్యాపారవేత్తలు తమ పరిసరాల్లో వ్యాపార అవకాశాలను గుర్తించేందుకు, నూతన పరిశ్రమలకు సహాయ సహకారం అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిన్న నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిష్కరించగలిగిన అర్జీలను సకాలంలో పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి ముఖ్యమని సత్యప్రసాద్ పేర్కొంటూ

వాయిస్...23 సెకన్లు

---------------------------

అపరిష్కృతంగా ఉన్న అభివృద్ధి హక్కుల బదిలీ–టీడీఆర్ బాండ్లను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. టీడీఆర్ బాండ్లపై పురపాలక, నగరపాలక సంస్థల కమిషనర్లతో మంత్రి నిన్న దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జారీ చేయాల్సిన టీడీఆర్ బాండ్లు 437 పెండింగ్ లో ఉన్నాయని, ఈ బాండ్లను, ఆన్ లైన్ లో లబ్దిదారులకు జారీ చేయాలని ఆదేశించారు. కొత్తగా వచ్చిన టీడీఆర్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను సత్వరం పూర్తిచేసి బాండ్లు అందించాలని మంత్రి సూచించారు.

---------------------------

బోర్డర్– గవాస్కర్ ట్రోఫీ లో భాగంగా భారత్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న అయిదవ ఆఖరి టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కడపటి వార్తలు అందే సరికి తన మొదటి ఇన్నింగ్స్ లో 4 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. బూమ్రా, సిరాజ్ చెరి రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకముందు భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌట్ అయింది.

---------------------------

పోలీసులు చట్టాన్ని అనుసరించి విధులు నిర్వహించాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని టీజీఎస్పీ బెటాలియన్లలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక పోలీస్ విభాగంలో ఉత్తమ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ క్రీడలలో తెలంగాణ ఖ్యాతిని చాటిన బాక్సర్ నిఖత్ జరీన్,క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌లు ప్రస్తుతం టీజీఎస్పీ డీఎస్పీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని చెప్పారు. వారి ఆధ్వర్యంలో నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

======================